# కుటుంబమంతా.. ఒకే పోలింగ్ బూత్‌లోకి

ఒకే ఇంట్లో ఆరు ఓట్లకు మించితే రీ వెరిఫై చేస్తాం

- డూప్లికేట్ ఓటర్లు, ఫొటో మిస్ మ్యాచ్, ఇంటి నంబర్లను పూర్తి స్థాయిలో ప్రక్షాళన
- తప్పులు లేని ఓటరు జాబితా తయారుకు కృషి
- జనవరి 1 నుంచి నూతన ఓటరు నమోదు
- ఓటరు జాబితాలో తప్పుల సవరణకు అవకాశం
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురిస్తాం
- రాజకీయ పార్టీల నేతల సమావేశంలో కమిషనర్ రొనాల్డ్ రాస్



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా తప్పులు లేని ఓటరు జాబితా తయారుకు కృషి చేస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు సహకరించాలని, అందు కోసం జనవరి 1వ తేదీ నుంచి నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో తప్పుల సవరణలు చేసుకొనుటకు భారత ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించిందని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై సమావేశం నిర్వహించారు. జనవరి 1వ తేదీ నుంచి https://ceotelangana.nic.in/ ఆన్‌లైన్ ద్వారా, ఆఫ్ లైన్‌లో సంబంధిత బీఎల్ఓలకు 18 సంవత్సరాలు నిండిన వారు ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు లేనివారు నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో తప్పుల సవరణలు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని రొనాల్డ్‌రాస్ తెలిపారు.

### స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 ఇలా..

- జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా ఈఆర్ఓలు ప్రీ రివిజన్ పనులను డిసెంబర్ 20 నుంచి జనవరి 1వ తేదీ వరకు ఓటరు జాబితా, ఎపిక్ కార్డులో తప్పులు పరిశీలిస్తారని తెలిపారు. ఎపిక్ కార్డుపై ఫొటో క్లియర్‌గా ఉండేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు.
- 2024 జనవరి 1వ తేదీ ప్రాతిపదికన సప్లిమెంటరీ ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్‌ను సిద్ధం చేస్తామన్నారు.
- జనవరి 6వ తేదీన ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరోల్‌ను ప్రచురిస్తామని తెలిపారు.
- క్లెయిమ్స్, ఆబ్జెక్షన్‌లను జనవరి 6 నుంచి జనవరి 22 వరకు స్వీకరించి ఫిబ్రవరి 2వ తేదీ నాటికి క్లియర్ చేస్తామని పేర్కొన్నారు.
- తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 8వ తేదీన ప్రచురిస్తామని తెలిపారు.
- ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ఇందులో భాగంగా ఈఆర్ఓలు అబ్సెంట్, షిఫ్టెటెడ్, డూప్లికేట్, ఓటర్లను పరిశీలించి స్పష్టమైన ఓటరు జాబితా తయారు చేసేందుకు ఈఆర్ఓలు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈఆర్ఓలు ఓటరు జాబితా ఆధారంగా, పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటి నంబర్‌లను వెరిఫై చేస్తారని, ఒకే కుటుంబంలో ఆరు మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నచో వాటిని రీవెరిఫై చేస్తామని తెలిపారు.

### పూర్తి స్థాయిలో ప్రక్షాళన

ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇతర పోలింగ్ కేంద్రాల్లో నమోదు అయిన ఓటర్లను, ఇతర నియోజకవర్గాల్లో నమోదైన ఓటర్లను, డూప్లికేట్ ఓటర్లను, ఫొటో మిస్ మ్యాచ్, ఇంటి నంబర్లను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని రొనాల్డ్ రాస్ తెలిపారు. ఇంటి నెంబర్ వారీగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ 1వ తేదీ నుంచి డిసెంబర్ 11 వరకు 15 నియోజకవర్గాలలో వివిధ రకాల ఫారంల ద్వారా వచ్చిన దరఖాస్తులను కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ శంకరయ్య, జాయింట్ కమిషనర్ మంగతాయారు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీఎస్పీ పార్టీ ప్రతినిధులు నందీష్ కుమార్, శివరాజ్ సింగ్, బీజేపీ నుంచి భరద్వాజ్, సీపీఐఎం ప్రతినిధి శ్రీనివాస రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు జి.నిరంజన్, రాజేశ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కార్తీక్ రెడ్డి, ఎంఐఎం పార్టీ ప్రతినిధి ముస్తాక్ తదితరులు పాలొన్నారు.

# దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలకం

బయో అగ్రి 2023 ఎక్స్ పోలో రైతు వెల్ఫేర్ విభాగం డీజీ, డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్

- రైతులకు చేయూతనందించేందుకు అనేక పథకాలు
- రసాయన ఎరువులతో కలుషితమవుతున్న భూమి
- స్మార్ట్ వ్యవసాయంలో నం.1 స్థానంలో భారత్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీజీ, డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, డాక్టర్ ఎస్‌కే మల్హోత్రా తదితరులు

మాదాపూర్, డిసెంబర్ 13 : భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం అత్యంత ముఖ్యమైనదని, భారత ప్రభుత్వం రైతులకు చేయూతనందించేందుకు అనేక పథకాలతో పాటు మొక్కల ఆరోగ్యం, మానవ ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నదని ఎన్ఐపీహెచ్ఎం (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్), వ్యవసాయం, రైతు వెల్ఫేర్ విభాగం డీజీ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో బుధవారం నిర్వహించిన బయో అగ్రి 2023 ఎక్స్ పో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ హాజరై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే మల్హోత్రా, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రవీన్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక మంది రైతులు తరతరాలుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న జనాభాకు సరిపోయే ఆహారాన్ని ఇవ్వాలనే ఉద్దేశ్యంతో గత 70 ఏండ్లుగా రసాయన ఎరువులను వేసి మట్టిని కలుషితం చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యకరమైన నేలను తిరిగిపొందడానికి ఎన్ఐపీహెచ్ఎం వద్ద రైతులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. దేశ వ్యాప్తంగా మొత్తం 58శాతం మంది నేరుగా వ్యవసాయం, అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్నారని, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం 2020 నాటికి 2.78 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ భూములు సేంద్రియ సాగులో ఉన్నట్లు పేర్కొన్నారు. మన దేశంలో ఉన్నటువంటి వాతావరణం కారణంగా స్మార్ట్ వ్యవసాయంలో జీ-20 సదస్సులో ఇతర దేశాలతో పోల్చితే అబ్జర్వర్స్ రీసెర్చ్ ఫౌండేషన్ భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలిపిందని డాక్టర్ ఎస్‌కే మల్హోత్రా అన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 25 పైగా కంపెనీలు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా 300పైగా పలు ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

## జేవీఆర్ పార్కును సందర్శించిన కమిషనర్

అభివృద్ధి పనులను వేగిరం చేయాలని అధికారులకు సూచన



సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): జలగం వెంగళరావు పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జలగం వెంగళరావు పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులతో సమీక్షించారు. పార్కు అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కులోని చెరువును పరిశీలించి చెరువును పరిశుభ్రంగా చేయాలని ఆదేశించారు. పార్కులో యోగా సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. సందర్శకులు సేద తీరేందుకు పార్కులో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ పేర్కొన్నారు. కమిషనర్ వెంట యూబీడీ అడిషనల్ కమిషనర్ వి.కృష్ణ, జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రె, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, యూబీడీ జాయింట్ డైరెక్టర్ సునంద తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్లు మంచిగ చూస్తున్నరా..?

- కింగ్‌కోఠి దవాఖానను సందర్శించిన కలెక్టర్
- అన్ని వార్డులు కలియ తిరిగి.. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా
- సహజ ప్రసవాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : జిల్లా అసుపత్రులకు వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు అక్కడే అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కింగ్ కోఠిలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిని సందర్శించి అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలపై అక్కడి డాక్టర్లను అడిగి తెలుసుకుని, సహజ ప్రసవాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దవాఖానలో డీఈఐసీ, ఎస్ఎన్‌సీయూల కోసం వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. రోగులకు అందిస్తున్న భోజనం, వికలాంగులకు అవయవాలను తయారు చేసే లింబ్ ఫిట్మెంట్ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆసుపత్రిలోని భగవాన్ మహవీర్ డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను ట్రస్ట్ సభ్యులైన గౌతమ్ జైన్, ఇంద్రజైన్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్డీవో సూర్యప్రకాశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. పీజీడీసీఏ, ఎంఈడీ, డీపీఈడీ తదితర కోర్సుల పరీక్షా ఫలితాలతో పాటు ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 29వ తేదీ నుంచి, బ్యాచ్‌లర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, ఇంప్రూవ్‌మెంట్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.